క్లుప్తంగా

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ వెంకటరామ్



దరఖాస్తు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటరామ్

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తు కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామ్ సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజాపాలన కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తుదారులు తప్పకుండా రసీదు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం జనవరి 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేష్, సిబ్బంది జంగయ్య, మల్లేష్, దేవేందర్, శివ, దనవర్ష తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: వార్డు అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని కౌన్సిలర్ రవినాయక్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని 10వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో వార్డులో సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

జిల్లెలగూడ శ్రీవారికి రూ.3 లక్షలకు పైగా కానుకలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి దేవాలయ హుండీని శుక్రవారం లెక్కించారు. 31 అక్టోబరు నుంచి డిసెంబరు 29వ తేదీ వరకు హుండీ ఆదాయం రూ.3,42,170 వచ్చిందని ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వర్‌చారి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, అర్చకులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మహేశ్వరం: శివగంగా రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పలంకరణ చేశారు. ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం



ఆదిత్య (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్‌సీఐ విజ్ఞాన్‌కంచ టౌన్‌షిప్‌లో రాథోడ్ అనిల్ నాయక్ భార్య ఆదిత్య(21)తో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇటీవల దంపతుల నడుమ గొడవలు మొదలైయ్యాయి. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం అనిల్ స్నానానికి వెళ్లిన సమయంలో ఆదిత్య బట్టలు సర్దుకొని.. కుమారుడిని ఇంట్లోనే వదిలేసి వెళ్లిపోయింది. భార్య ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 87126 62366 నంబర్‌లో సమాచారం అందించాలని ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు కోరారు.

చెరువులో గుర్రపుడెక్క..
కానరాని నీటి చుక్క

- మంత్రాల తటాకాన్ని ఆవరించిన గుర్రపుడెక్క
- దోమలు, పాములతో ప్రజల అవస్థలు
- నిర్వహణ మరిచిన అధికార యంత్రాంగం



మంత్రాల చెరువులో ఉన్న గుర్రపుడెక్క

మీర్‌పేట: పెరుగుతున్న వ్యర్థాలతో పాటుగా గుర్రపుడెక్క జత కలవడంతో చెరువు పరిసరాలు అధ్వానంగా మారాయి. ఆహ్లాద వాతావరణంతో ప్రకృతి ప్రియులను ఆకర్షించాల్సిన తటాకం ప్రస్తుతం దుర్గంధంతో కొట్టుమిట్టాడుతోంది. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువును గుర్రపుడెక్క కప్పేయడంతో పరిసర కాలనీవాసులు దోమలు, పలు రకాల కీటకాలతో అవస్థలు పడుతున్నారు. గతంలో హెచ్‌ఎండీఏ నుంచి ప్రత్యేకంగా యంత్రాన్ని తెప్పించి కొన్ని రోజుల పాటు గుర్రపుడెక్కనంతా తొలగించారు. దీంతో పరిసర కాలనీల వాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో చెరువు వద్దకు వచ్చి సేద తీరేవారు. గుర్రపుడెక్క తొలగించిన తరువాత నిర్వహణ మరిచిపోవడంతో మరలా చెరువు యథావిధి స్థానానికి చేరింది. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం చెరువు మొత్తాన్ని గుర్రపుడెక్క ఆక్రమించింది.

లోపించిన నిర్వహణ

రెండేళ్లలో చెరువులోని గుర్రపుడెక్కను తొలగించేందుకు కార్పొరేషన్ అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇవ్వలేదు. గుర్రపుడెక్కను శాశ్వతంగా తొలగించేందుకు డ్రోన్‌ల ద్వారా పిచికారీ చేయించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని పరిసర కాలనీవాసులు తెలిపారు. యంత్రంతో తొలగించినప్పటికీ ఆ తరువాత గుర్రపుడెక్క రాకుండా ఎప్పటికప్పుడు నిర్వహణ బాధ్యతలు తీసుకుంటే బావుంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



అలంకారప్రాయంగా గుర్రపుడెక్క తొలగించే యంత్రం

నిరుపయోగంగా..

గుర్రపుడెక్క తొలగించడానికి హెచ్‌ఎండీఏ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన యంత్రం 20 రోజులుగా పనిచేయకుండా నిరుపయోగంగా మారింది. చెరువులో ఓ వైపు యంత్రం ఉంటే అక్కడ గుర్రపుడెక్కను తొలగిస్తుంది. కానీ కొన్ని రోజులుగా కదలకుండా ఉండడంతో పరిసరాలన్నీ దుర్గంధమయం అయ్యాయి. దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి గుర్రపుడెక్కను తొలగించాలని పరిసర ప్రాంతవాసులు కోరుతున్నారు.

ప్రజలు భాగస్వాములు కావాలి

మన్సాన్‌పల్లిలో ప్రజాపాలన కార్యక్రమం

మహేశ్వరం: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ నర్సింహా పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 6వ తేదీ వరకు జరగనున్న కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీలు, వార్డులు, డివిజన్లలో గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు రేషన్ కార్డులు, ఇతర అవసరాలకు వినతి పత్రాల ఫిర్యాదును సైతం తీసుకుంటున్నామన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మన్సాన్‌పల్లి గ్రామ సర్పంచ్ అరుణ, ఉప సర్పంచ్ నర్సింహాయాదవ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు సురేందర్‌రెడ్డి, గణేష్, యాదయ్య, రమేష్, పంచాయతీ కార్యదర్శి జావేద్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: దెబ్బడగూడలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ తదితరులు

హెల్ప్ డెస్క్

పహాడీషరీఫ్: ప్రజాపాలన గ్యారంటీల కోసం జల్‌పల్లి మున్సిపాలిటీలో కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, పహాడీషరీఫ్, షాహీన్‌నగర్, కొత్తపేట, ఎర్రకుంటలో ఏర్పాటు చేసిన కౌంటర్లకు చేరుకొని తమ దరఖాస్తులను అందజేస్తున్నారు. దరఖాస్తుదారుల సందేహాల నివృత్తి కోసం మున్సిపాలిటీ కమిషనర్ వసంత పర్యవేక్షణలో హెల్ప్ డెస్క్‌ను కూడా ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మన్న రవికుమార్ పేదలకు దరఖాస్తు ఫారాలను అందించారు.



పహాడీషరీఫ్: దరఖాస్తు పత్రాలతో స్థానికులు

రెండో రోజు ప్రజాపాలన

కందుకూరు: మండల పరిధిలో రెండో రోజు శుక్రవారం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. దెబ్బడగూడలో సర్పంచ్ ఏనుగు శ్రావణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ గోపాల్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పర్యవేక్షించారు. బాచుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట్రాములు హాజరై ప్రతిజ్ఞ చేయించి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు రాఘవేందర్, విన్సెంట్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం, విజయ్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: మన్సాన్‌పల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ నర్సింహ

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సిలింగ్



రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కౌన్సిల్ సభ్యులు రవి, సీఐ జోసెఫ్

నాగోలు: మద్యం తాగి వాహనాలు నడపడం తమ కుటుంబంతో పాటు ఇతరులు కూడా తీవ్ర ఇబ్బందులు పడతారని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు సీహెచ్ రవి అన్నారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 34 మంది నిందితులకు వారి కుటుంబసభ్యుల సమక్షంలో శుక్రవారం రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ చిల్డ్రర్ పార్కులో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు రవి మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడపడంతోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. న్యాయపరంగా ఇబ్బందులు తలెత్తితే తమ సంస్థను సంప్రదించవచ్చని, బాధితులకు చట్టపరంగా న్యాయసలహాలు అందజేస్తామన్నారు. తమ కుటుంబ సభ్యులనే కాకుండా ఇతరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టొద్దని సూచించారు. టీటీఐ ఎస్సై మనోహర్, ఎస్‌ఓపీ అలూరయ్య, సిబ్బంది రమేష్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించి పనులను ఇంజినీరింగ్ అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో రూ.30 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. కాలనీలలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. తీగల అమర్నాథ్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేష్‌గౌడ్, రాంచందర్‌నాయక్ తదితరులున్నారు.

నేడు గట్టుఇప్పలపల్లిలో గ్యాస్ ఈ కేవైసీ

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో శనివారం గ్యాస్ ఏజెన్సీవారు గ్యాస్ ఖాతా నంబర్‌కు కేవైసీతో పాటు ఆధార్ లింక్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత రేణురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనతో తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. గ్రామస్తులు తమ గ్యాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకుని రావాలని కోరారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

జిల్లా ట్రాన్స్‌కో సీజీఎం ఆనంద్

తుర్కయంజాల్: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ట్రాన్స్‌కో సీజీఎం ఆనంద్ తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీలోని లక్ష్మీనగర్, ఇందిరమ్మ కాలనీలో ఆయన పర్యటించి వినియోగదారుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పలుచోట్ల దెబ్బతిన్న, వంగిపోయిన, తుప్పుపట్టిన కరెంటు పోల్‌లతోపాటు, ట్రాన్స్‌ఫార్మర్లు, పనిచేయని ఏబీ స్విచ్‌లను గుర్తించారు. బిల్లులో పేరు మార్పిడి, ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ కరుణాకర్, డీఈ యాదగిరి, ఏడీఈ వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల కల నెరవేరుతోంది

- శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠలో ప్రజలు భాగస్వాములు కావాలి
- అందెల శ్రీరాములు యాదవ్



అక్షింతల వితరణలో పాల్గొన్న శ్రీరాములుయాదవ్ తదితరులు

మీర్‌పేట: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠలో ప్రజలంతా భాగస్వాములు కావాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ కోరారు. శుక్రవారం మీర్‌పేట తిరుమల హిల్స్‌లోని శ్రీ సీతారాముల వారి దేవాలయంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల వితరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 22న అయోధ్యలో జరిగే శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠలో ప్రత్యక్షంగా పాల్గొనని వారు సాయంత్రం ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి, పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు నర్సింహా, కార్పొరేటర్లు గోవర్ధన్‌రెడ్డి, భిక్షపతిచారి, హరినాథ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాఘవేందర్, రవీందర్‌రెడ్డి, విక్కీసాగర్, రఘు, రామ్మూర్తి శర్మ పాల్గొన్నారు.

అక్షింతల ఊరేగింపు

మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి రామాలయం కమిటీ ఆహ్వానం మేరకు అక్షింతల కలశపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రామ మందిరం నిర్మాణం పూర్తికావటం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 31న మీర్‌పేట కార్పొరేషన్‌లో అక్షింతలను ఊరేగించి ప్రతి ఇంటికి చేరే విధంగా కార్యక్రమం చేపడతామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్ టాపర్స్‌కు సన్మానం



బహుమతి పత్రాలు చూపుతున్న విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: విద్యార్థులు శ్రీనివాసన్ రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని గణితంలో అద్భుతాలు సృష్టించాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్‌రెడ్డి సూచించారు. ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో శుక్రవారం మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్ టాపర్లకు నిర్వహించిన అభినందన సభకు ఆయన హాజరై సర్టిఫికేట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రామానుజన్ చేసిన సేవలు ఎంతో ఆదర్శనీయమని, గణిత శాస్త్రానికి నూతన అధ్యాయాన్ని అందించిన మహనీయుడని గుర్తుచేశారు. ప్రథమ బహుమతి కింద రక్షిత్‌సాయి, కార్తీక్ గౌతమ్, ఏ.చౌదరి, త్రినాథ్‌రావులకు రూ.5 వేలు, ద్వితీయ బహుమతి కింద కృతికి, విజయ, మణిదీప్, యశస్విని, పునిందులకు రూ.3వేలు, తృతీయ బహుమతి కింద సాయిచరణ్, శివగణేష్, చరితకుమార్, సింధుజ, రోహిత్‌లకు రూ.2వేలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణం శుభపరిణామం

- గుడి, బడికి సమప్రాధాన్యత ఇవ్వాలి
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

మహేశ్వరం: పురాతన ఆలయాలను పునర్నిర్మించుకోవటం శుభపరిణామమని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో యశోద-చంద్రయ్య ముదిరాజ్ దంపతులు సొంత డబ్బుతో మావురాల ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. గుడికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, బడికి అంతే ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయాన్ని నిర్మించిన దాతలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునితా నాయక్, సర్పంచ్ ప్రియాంక, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు చంద్రయ్య ముదిరాజ్, అంజయ్య ముదిరాజ్, సురేందర్ రెడ్డి, ఆనందం, నవీన్, రాజు నాయక్, రాజేష్, జయేందర్, యాదగిరి గౌడ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్‌కు పీహెచ్‌డీ పట్టా



ప్రవీణ్‌కుమార్‌ను అభినందిస్తున్న సబితారెడ్డి తదితరులు

కందుకూరు: మండలంలోని బాచుపల్లి పరిధిలోని పెరుగుగూడకు చెందిన యాలాల ప్రవీణ్‌కుమార్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. చరిత్ర విభాగంలో డా.బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ ఈ.సుధారాణి పర్యవేక్షణలో ఆయన పీహెచ్‌డీ పూర్తి చేశారు. గురువారం సాయంత్రం యూజీసీ కమిషన్ చైర్మన్ మామిడాల జగదీష్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. కాగా శుక్రవారం ఆయనను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యాలాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరంతర కృషితోనే లక్ష్య సాధన



చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఏకాగ్రతతో కూడిన నిరంతర సాధనతోనే ఎంచుకున్న లక్ష్యం సులభంగా దక్కుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నేపాల్ దేశంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో చంపాపేటకు చెందిన లాస్య, శరత్‌కళ్యాణ్‌లు బంగారు, సిల్వర్ పతకాలు దక్కించుకోగా.. శుక్రవారం ఆయన ఎల్‌బీనగర్‌లో విజేతలను అభినందించి పతకాలను ధరింపజేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు సుంకోజు కృష్ణమాచారి, నిశికాంత్‌రెడ్డి, కోచ్ ఉమాశంకర్ తదితరులున్నారు.

హ్యాండ్లూమ్ మేళాకు విశేష స్పందన



వనస్థలిపురం మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: హుడా ఓపెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వహకులు తెలిపారు. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలుకు వనస్థలిపురం, పరిసర కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, గాజులు, బ్యాగులు, హైదరాబాద్ ముత్యాలు తదితర ఉత్పత్తులను సంక్రాంతి పండుగ సందర్భంగా తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని వివరించారు.